క్లుప్తంగా

396 మంది రోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 396మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిం చినట్లు ఎంపీటీసీ రామకృష్ణ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబి రంలో పరీక్షలు నిర్వహించి 83మందిని రిఫరల్ చేసినట్లు చెప్పారు. వారిలో ఎవరైనా మెరుగైన వైద్యం, శస్త్రచికిత్సల నిమిత్తం రాగోలు వెళ్లాలనుకుంటే గురువారం ఉదయం 8గంటలకు బస్సు ఏర్పాటు చేశామని అందులో వెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు సాయితేజ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ హై స్పీడ్ ఇంటర్నెట్

- సబ్ డివిజనల్ ఇంజినీర్ బి.దామోదర్



పార్వతీపురంటౌన్: గిరిజన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ బి.దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైస్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు టీవీ చానెల్స్ ప్రసారాలు కూడా పార్వతీపురం కురుపాం, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాలలో అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. వీటితోపాటు పార్వతీపురం బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్దనే వినియోగదారుల సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ సిమ్ కార్డ్‌తో పాటు బిల్లుల చెల్లింపులు కూడా జరుగుతాయన్నారు. త్వరలో మరిన్ని ప్రాంతాలకు ఐపీటీవీతోపాటు ఇంటర్నెట్ సేవల విస్తరణకు పూర్తి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు

క్యాలెండర్ విడుదల



బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో విడుదల చేసిన క్యాలెండర్

బలిజిపేట: ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎంపీడీఓ భానుమూర్తి, అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏపీఎన్‌జీఓ తరఫున కార్య క్రమాలను క్యాలెండర్ ప్రకారం నిర్వహిస్తామని సంఘం సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైస్ ప్రెసిడెంట్ విక్టర్, బొబ్బిలి యూనిట్ జాయింట్ సెక్రటరీ భాస్కరరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

350 పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యశాఖ సిబ్బంది

బలిజిపేట: మండలంలోని వెంగళరాయపురంలో 350 పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కుర్చీల వితరణ



కుర్చీలు వితరణగా ఇస్తున్న సర్పంచ్ జర్జాపు మోహన్

సాలూరు: మండలంలోని శివరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్థానిక సర్పంచ్ జర్జాపు మోహన్ కుర్చీలు వితరణగా అందజేశారు. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీ కేంద్రానికి 20 కుర్చీలను ఇచ్చారు. ఈ క్రమంలో పిల్లలకు అవసరమైన ఇతర వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా అవసరమైతే తనను తెలపాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పార్వతి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని దీసరిగూడ గ్రామ పరిసరాల్లో ఎస్‌ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో 10 లీటర్ల సారా బుధవారం పట్టుకున్నారు. ఎస్.సుధాకర్ అనే వ్యక్తిని సారాతో పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షల ప్రారంభం



బలిజిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ కళాశాలలకు చెందిన 466మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 427 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్సై జి.పైడిరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయని పరీక్షల చీఫ్ కులరాజు అన్నారు. పార్వతీపురం పట్టణంలోలో 4 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 1545 మందికి గాను 73 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచి అత్యవసర చికిత్స నిమిత్తం ప్రథమ చికిత్స వైద్యశిబిరాలను, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను కల్పించామని తెలిపారు, డ్రింకింగ్ వాటర్, టేబుల్స్ అందుబాటులో ఉంచామన్నారు.

బలిజిపేటలో..339మంది

బలిజిపేట: మండలంలోని రెండు కేంద్రాలలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 339మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 358మంది విద్యార్థులకు 19మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్నింగ్ బెల్లు కొట్టకుండా చివరలో వచ్చి పరీక్ష పేపర్ తీసుకోవడంతో ఇబ్బంది పడినట్లు విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 234మందికి 219మంది, పీఎస్ఎన్ కళాశాలలో 124మందికి 120మంది హాజరయ్యారు.

ఈ క్రాప్ నమోదులో నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: ప్రభుత్వ పథకాలు రైతులకు అందేందుకు ఈ క్రాప్ నమోదు కీలకమని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పెదపధం రైతుభరోసా కేంద్రం పరిధిలో ఏఓ అనూరాధ పండా ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ చేయకుంటే ప్రభుత్వ పథకాలు రైతులకు అందే అవకాశం ఉండదని హెచ్చరించారు. కావున ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది పొలాల్లో పర్యటించి ఈ క్రాప్ చేయడంతో పాటు దానిపై రైతులకు అవగాహన పెంపొందించాలని స్పష్టం చేశారు. రైతులకు ఏ సమస్యలున్నా ఆర్బీకే సిబ్బందికి తెలపాలని సూచించారు.

తాగునీరు, నీడ తప్పనిసరి

- కొలతల ప్రకారం పని చేస్తేనే వేతనం గిట్టుబాటు
- డ్వామా పీడీ రామచంద్రరావు



పార్వతీపురంటౌన్: వేసవి ఎండలకు తాగునీరు, నీడ తప్పనిసరి అని డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వేతనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం వేతనదారులు పనులు చేస్తేనే వేతనం గిట్టుబాటవుతుందన్నారు కొలతల ప్రకారం రెండు పూటలా పని చేస్తే రూ.257 కూలి గిట్టుబాటవుతుందని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌లో వేతన దారుల పనుల ఫొటో అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీఓతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

పైలెట్ వాటర్‌స్కీం ట్యాంకును ధ్వంసం



ధ్వంసం చేసిన వాటర్‌ట్యాంకును పరిశీలిస్తున్న కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు

సాలూరు: పట్టణంలోని బంగారమ్మపేటలో గల పైలెట్ వాటర్‌స్కీంట్యాంకును మంగళవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారని స్థానిక కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, సంఘటనా స్థలాన్ని పరిశీలించి దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసి, మున్సిపల్ అధికారులకు విషయం తెలియజేశానని చెప్పారు.

ఉపాధి పనులపై సమీక్ష



ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న సమావేశం

బలిజిపేట: ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ భానుమూర్తి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంతమందికి జాబ్‌కార్డులు ఉన్నాయి, ఆధార్ అనుసంధానం చేసుకున్నవారు ఎంతమంది, మిగిలినవారికి ఎందుకు అనుసంధానం జరగలేదు. ఉపాధి హామీ పథకంలో గృహనిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ ఎంతవరకు జరిగింది, రానున్న రోజుల్లో పనుల ప్రణాళిక, ఎంతమంది వేతనదారులు లెక్కలోకి వస్తారు. పనులు జరుగుతున్న వివరాలు, వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందుతున్నదీ, లేనిదీ, వేతనదారులతో ఏవిధంగా పనులు చేయించాలి, పంచాయతీల వారీగా ప్రణాళిక పక్కాగా ఉన్నదీ లేనిదీ అన్న వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

సీతానగరం: మండలంలోని గుచ్చిమిలో రెండు రోజుల నుంచి జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఆలయ అర్చకుడు కర్రి వెంకటరమణమూర్తి శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు సమకూర్చుకున్న సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అంతకు ముందు గ్రామంలోని పుర వీధుల్లో మేళతాళాలు, కోలాటాలతో తిరువీధి అనంతరం ఆలయంలో విగ్రహాలకు వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించామన్నారు. ప్రతిష్ఠ అనంతరం వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎం శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ జగదీశ్వరరావు, ఉపసర్పంచ్ ఆర్ వెంకటరమణ, భజన మండలి సభ్యుడు బి.శంకరరావు పాల్గొన్నారు.

కొండగిరి చర్చికి తాగునీరు



నిడగల్లుకొండ రహదారిలో బోరుతీస్తున్న పవర్‌డ్రిల్

సీతానగరం: మండలంలోని నిడగల్లు కొండగిరిపై క్రైస్తవులు ప్రార్థనలు చేసేందుకు వెళ్లే సమయంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తీసుకురావడమే తడువుగా తక్షణమే బోరువేయించి తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు గాజాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నిడగల్లు గ్రామానికి వచ్చిన సమయంలో కొండపైకి తాగునీటి సౌకర్యం లేదని కాలనీ వాసులు చెప్పారన్నారు. దీంతో బోరు తీయించి తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బోరు తీయించినట్లు చెప్పారు. ఇచ్చిన హామీ అమలు చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులంతా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ టి సూర్యనారాయణ, జి శ్రీనివాసరావు, పంచాయితీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కల్వర్టు సమస్య పరిష్కరించండి



ఇళ్లలోకి చేరుతున్న మురుగునీరు



కల్వర్టు కింద నుంచి నీటిని పంపించేందుకు పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్‌లు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో వైఎస్సార్‌కూడలి వద్ద ఉన్న కల్వర్టు సమస్య పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ కోరారు. 2006లో ఈ కల్వర్టును ఆర్ అండ్‌బీ అధికారులు నిర్మించిన క్రమంలో రోడ్డుకు రెండున్నర అడుగుల లోతులో నిర్మాణం చేపట్టడం వలన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కాగా శివాలయం రోడ్డు వద్ద కాలువలో నీరు కల్వర్టు గుండా వెళ్లకపోవడంతో మురుగునీరు స్థానిక ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో స్థానిక సర్పంచ్ స్పందించి పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌ల సాయంతో నీటిని మళ్లించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియచేసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఆర్ అండ్‌బీ డీఈ సుబ్బారావు, ఏఈ విజయకుమార్‌లు సంఘటనా స్థలానికి బుధవారం వచ్చి కల్వర్టు కింద పైపులైన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో సమస్య ఏర్పడిందని గుర్తించామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఆర్‌ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి అవకాశాలు కలిగిన స్వల్పకాలిక కోర్సులను గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ఆర్‌ఐటీఐలో ప్రారంభించనున్న ట్లు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి కౌశల్య వికాస్ యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలున్న అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ (ఫ్యాబ్రికేషన్) టెక్నీషియన్ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. మూడు నెలల కాల పరిమితి గల ఈ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి కన పరిచే వారు విద్యార్హత ధ్రువపత్రాలతో పని వేళల్లో ఆర్‌ఐటీఐ కళాశాలకు వచ్చి అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 7981308986, 6304086821 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అమ్మవార్ల అనుపోత్సవం



బూర్జలో ఘటాలతో వనంగుడికి వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని బూర్జ, తామరఖండి గ్రామాల్లో రెండు రోజులుగా జరుగుతున్న అమ్మవారి జాతరలు బుధవారం అనుపోత్సవంతో ముగిశాయి. కొత్తబూర్జ, పాతబూర్జ గ్రామాల్లో మంగళవారం రాత్రి తిరువీధి అనంతరం ఘటాలకు పూజలు చేసి అంగడిలో ఉంచారు. బుధవారం ఉదయం ఘటాలు ఉండే అంగడి నుంచి అమ్మవారి వనం గుడివరకూ మేళతాళాలతో ఘటాలను ఊరేగించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తామరఖండిలో జరిగిన చిన్నమ్మవారిజాతరను పురస్కరించుకుని రామమందిరం వద్ద ఉన్న అంగడి నుంచి వనంగుడి వరకూ తిరువీధి చేస్తూ అనుపోత్సవం నిర్వహించారు. మూడురోజులు మూడు గ్రామాల్లో అమ్మవారి జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆయాగ్రామాల్లో జాతరలు జరిగిన మూడు రోజులూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, సీతానగరం పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.



తారఖండిలో ఊరేగింపుగా పూజాసామగ్రితో గుడికి వెళ్తున్న భక్తులు

వినియోగదారుడే రాజు

- చట్టాలపై అవగాహన కల్పిస్తాం
- కరపత్రాలతో ప్రచార ర్యాలీ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఫోరం ప్రతినిధులు

పార్వతీపురంటౌన్: న్యాయమైన వ్యాపారం, నాణ్యమైన వస్తుసేవలు అందిన రోజు వినియోగదారుడే రాజు అవుతాడని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధి చందక అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని శ్రీవారి సన్నిధి కల్యాణమంటపంలో వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే కార్యక్రమాన్ని ఆ సంస్థ ప్రతినిధులు నిర్వహించారు. అనంతరం కరపత్రాన్ని, స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు కన్స్యూమర్ రైట్స్, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే వ్యాపార సంస్థల యజమానులకు కూడా చైతన్యం కలిగిస్తామని చెప్పారు. ప్రతి వినియోగదారుడు తన హక్కులను తెలుసుకునేలా చైతన్యపరిచి వస్తువు కొనుగోలు సమయంలో నాణ్యమైన వస్తుసేవలు పొందేలా అవగాహన కల్పిస్తామన్నారు. మోసపోయిన వినియోగదారులు ఎవరైనా తమను సంప్రదిస్తే న్యాయపరంగా వారి వెంట ఉండి న్యాయం చేస్తామన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులకు సంబంధించి ప్యాకింగ్ చేసే సమయం, ఎప్పటి వరకు వినియోగించవచ్చనే సమయాన్ని తప్పక పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జె. శ్రీనివాసరావు, వి.దాలినాయుడు, పి.శ్రీనివాసరావు, కె. సన్యాసిరాజు, బి.ప్రకాశ రావు, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు



బూర్జ ఆరోగ్య ఉపకేంద్రంలో సార్వత్రిక టీకాలపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

సీతానగరం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సమకూర్చిన వ్యాధినిరోధక టీకాలను నిర్దేశించిన గడువులోగా వైద్య సిబ్బంది వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు బుధవారం పెదంకలాం, బూర్జ గ్రామాల్లోని ఉపఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది వేస్తున్న సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన గడువులోగా వైద్యసిబ్బంది వేయాలని, అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాల వల్ల ఉపయోగాలు, పిల్లల తల్లులుకు ఆరోగ్యపరమైన వివరాలపై అవగాహన కలిగించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలతల్లులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే అధిక దిగుబడులు



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎస్ కమల

సీతానగరం: నవధాన్యాలు సాగు చేయడంతోనే భూమి సారవంతం, పోషకవిలువలు పెరిగి అధిక దిగుబడుల సాధనకు దోహద పడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎస్.కమల అన్నారు. ఈ మేరకు మండలంలోని నీలకంఠాపురంలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానం అమలు కోసం అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో పోషక విలువలు అభివృద్ధి చెంది పంటసాగు సమయంలో అధిక దిగుబడులు సాధించడానికి దోహదపడుతుందన్నారు.రసాయన రహిత పంటలు సాగు చేయడం వల్ల రైతులు వ్యాధుల బారినుంచి రక్షించవచ్చన్నారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వల్ల వచ్చే ఉపయోగాలు, ఎరువుల వినియోగం తగ్గుదల తదితరఅంశాలపై అవగాహ సదస్సులు నిర్వహించాలని సంకల్పించినట్లు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతుల్లో అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలనాయకులు వై.గోపాలనాయుడు, గ్రామ వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

గోశాలల బకాయి చెల్లింపు

- రైతుల ఖాతాలకు రూ.73.05లక్షలు జమ



రైతులు నిర్మించిన గోశాల

బలిజిపేట: టీడీపీ హయాంలో రైతులు నిర్మించిన గోశాలలకు ఇప్పటి ప్రభుత్వం వారి ఖాతాల్లో బకాయి నిధులు జమచేసి న్యాయం చేసింది. 2016–17ఆర్థిక సంవత్సరంలో పశువుల సంఖ్యను బట్టి గోశాలల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసుకోవాలని అప్పట్లో పథకాన్ని ప్రవేశపెట్టిన టీడీపీ ప్రభుత్వం 2018–19లో వాటిని మంజూరు చేసింది. నిర్మాణాలు పూర్తయినా అరకొరగా నిధులు జమ చేసి రైతులకు మొండిచేయి చూపించింది. దీంతో రైతులు గగ్గోలు పెట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో గోశాలల నిర్మాణాలకు సంబంధించి పూర్తి వివరాలు పంపాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు కసరత్తు పూర్తయిన తరువాత అధికారులు పంపిన వివరాల మేరకు బకాయి నిధులను వారి ఖాతాలలో జమ చేసింది.

గోశాలల మంజూరుకు కేటాయించిన విధానం ఏమంటే:

- 2ఆవుల శాలకు రూ.1లక్ష
- 4ఆవుల శాలకు రూ.1.50లక్షలు
- 6ఆవుల శాలకు రూ.1.80లక్షలు

ఈ ప్రకారం రైతులు గో శాలల నిర్మాణం చేశారు. ఈ మొత్తంలో రైతు వాటాకింద 10శాతం నిధులు జమచేయాల్సి ఉంది. దీనిని తిరిగి రైతులకు చెల్లించే పద్ధతి పెట్టారు.

బలిజిపేట మండలంలో గోశాలల నిర్మాణ వివరాలు	
గోశాలలకు వచ్చిన దరఖాస్తులు	410
అనుమతులు లభించినవి	210
నిర్మాణాలు పూర్తయినవి	152

అప్పట్లో రైతులకు అరకొరగా నిధులు జమకాగా బకాయిలు ఉండిపోయిన మొత్తం 142మంది రైతులకు ప్రస్తుతం రూ.73,05,414లు వారి ఖాతాల్లో జమయ్యాయి. 10మంది రైతులకు చెందిన బిల్లులకు సాంకేతిక లోపాలు ఎదురయ్యాయి.

సంతోషంగా ఉంది

టీడీపీ హయాంలో గోశాలలు నిర్మించమంటే నిర్మించాం. అరకొరగా డబ్బులు జమ అయ్యాయి. మిగిలినవి వస్తాయని ఊహించలేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు రావాల్సిన గోశాలల మొత్తాలను ప్రభుత్వం జమ చేయడంతో సంతోషంగా ఉంది.

గంగయ్య, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు, మిర్తివలస

మిగిలినవి వచ్చేందుకు చర్యలు

గోశాలల డబ్బులు జమకావడంతో రైతులు సంతృప్తి చెందుతున్నారు. మరో పదిమంది రైతులకు సాంకేతిక లోపంతో నిధులు రాలేదు. అవి వచ్చేవిధంగా శాఖాపరమైన చర్యలు చేపడతాం.

గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట